చెత్త సేకరణ ట్రాక్టర్ల నిర్వహణ ఎలా?

- స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా తొమ్మిది పంచాయతీలకు మంజూరు
- మెయింటెనెన్స్ భారంతో తప్పని ఇబ్బందులు

శ్రీకాకుళం రూరల్: పంచాయతీల్లో చెత్త సేకరణకు సంబంధించి ఇటీవల ట్రాక్టర్లను పంపిణీ చేశారు. కొద్ది నెలల క్రితం స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా శ్రీకాకుళం రూరల్ మండలానికి తొమ్మిది ట్రాక్టర్లు మంజూరు కాగా.. ఇటీవల పంచాయతీలకు వాటిని చేరవేశారు. శ్రీకాకుళం రూరల్ మండలంలో 23 పంచాయతీలకుగాను కల్లేపల్లి, పొన్నాం, ఎస్‌ఎస్‌వలస, గూడేం, వప్పంగి, ఖాజీపేట, కనుగులవానిపేట తదితర పంచాయతీలకు ఈ టాక్టర్లు మంజూరు చేశారు.

మెయింటెనెన్స్ చార్జీల భారం..

మూడు వేలు జనాభా దాటిన పంచాయతీలకు కొత్తగా ట్రాక్టర్లు అందించినా మెయింటెనెన్స్ బాధ్యతలను మాత్రం ఆయా పంచాయతీలకే అప్పగించారు. వాస్తవానికి ఒక ట్రాక్టర్ చెత్త సేకరణకు నెల మొత్తం తిరగాలంటే సుమారు లక్ష రూపాయల పైనే ఖర్చు కానుంది. ఆ మొత్తం పంచాయతీయే భరించాల్సి రావడంతో ఇన్నాళ్లూ ట్రాక్టర్లు తీసుకోవాలా వద్దా అన్న సందిగ్ధంలోనే సర్పంచ్‌లు ఉన్నారు. అయితే పంచాయతీల్లో చెత్త సేకరించిన స్కావెంజర్స్‌కు (గ్రీన్ అంబాసిడర్స్) మాత్రం ఈ ట్రాక్టర్లు కాస్త ఊరట ఇస్తాయి. కేవలం తోపుడుబళ్ల ద్వారా మాత్రమే చెత్తను పోగుచేస్తూ తీసుకెళ్తున్న వారికి కొత్త ట్రాక్టర్లతో కొంత పని ఒత్తిడి తగ్గనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



గూడేం పంచాయతీకి కేటాయించిన ట్రాక్టర్

నిర్వహణ బాధ్యత వారిదే..

స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా ఆరు పంచాయతీలకు కొత్త ట్రాక్టర్లు మంజూరయ్యాయి. వీటి మెయింటెనెన్స్ చార్జీలు పంచాయతీలే చూసుకోవాలి. అవసరమైతే 15వ ఆర్థిక సంఘం శానిటేషన్ నిధులను వాడుకునే వెసులుబాటు ఉంది.
– సూర్యనారాయణ, ఈఓపీఆర్‌డీ, శ్రీకాకుళం రూరల్ మండలం

ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నార్తన్ మెరైన్ చీఫ్ ఇంజినీర్ కార్తీక్ పన్నీర్ సెల్వం, ప్రాజెక్టు కో–ఆర్డినేటర్, సివిల్ ఫౌండేషన్ ఏఈ నిఖిల్ పట్నాయక్ మాట్లాడుతూ దేశానికి సైనికులు అందిస్తున్న సేవలు కొనియాడారు.

అధికారులపై ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఆగ్రహం

జి.సిగడాం: పింఛన్ల పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని, పనితీరు మార్చుకోకపోతే తక్షణమే సెలవు పెట్టి ఇంటికి వెళ్లిపోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మధుపాంలో పింఛన్ల పంపిణీ పరిశీలించారు. గ్రామంలో ఓ వృద్ధుడికి రూ. 4 వేలు బదులుగా రూ.2 వేలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఆ సొమ్ము లెక్కపెట్టడంతో రూ.2 వేలు మాత్రమే ఉండటంపై ఆగ్రహం చెందారు. ఇలాగే ఉద్యోగాలు చేస్తారా? అంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ బోగాది అప్పలనాయుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

నూతన సంవత్సర శుభాకాంక్షలు



రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజలకు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారంనూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది అందరికి మంచి కలగాలని ఆకాంక్షించారు.

నిర్ణయించిన ధరలకే క్రయవిక్రయాలు

ఎచ్చెర్ల: జిల్లాలోని సరుగుడు, నీలగిరి రైతులు, వ్యాపారులు నిర్ణయించిన ధరలకే అమ్మకాలు, కొనుగోళ్లు చేపట్టాలని సరుగుడు, నీలగిరి రైతు, వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బస్వా గురుమూర్తిరెడ్డి అన్నారు. మంగళవారం లావేరు మండలం బుడుమూరు సంతతోటలో సరుగుడు, నీలగిరి రైతు, వ్యాపారుల సంఘం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా బస్వా గురుమూర్తిరెడ్డి, కార్యదర్శిగా బుగడ రాంబాబు, కోశాధికారిగా ఆరెళ్ల కృష్ణ, సభ్యులుగా పి.సన్యాసిరావు, పూర్ణచంద్రరావు, అలుపన సింహాచలంలను ఎన్నుకున్నారు.

భగవద్గీత పఠించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేటలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు సంతోష్‌కుమార్, ఇతర ప్రచారకులు పాల్గొన్నారు.

దుస్తుల వితరణ

గార: క్రిస్మస్ వేడుకల్లో భాగంగా దైవజనులు, పేదలకు దుస్తులు అందజేయడం ఆనందదాయకమని అబ్దుల్ జోసెఫ్ అన్నారు. మంగళవారం గారలోని ఏసుక్రీస్తు మహిమ మందిరంలో జిల్లాలోని పలు చర్చిల దైవజనుల (పాస్టర్లు) కుటుంబ సభ్యులకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిమ మందిరం బిషప్ వి.జాషువా, సత్య పాల్గొన్నారు.

కె.మన్నయ్యపేటలో వైద్య శిబిరం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని కె.మన్నయ్యపేటలో జాతీయసేవా పథకంలో భాగంగా నైరా వ్యవసాయ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మంగళవారం మెడికవర్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

రిజర్వేషన్ పెంచాలని వినతి

గార: ఆది ఆంధ్ర కులస్తులమైన తమను ఎస్సీ–డీలో కొనసాగిస్తూ రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని గోరువానిపేట గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్ ఎస్.రమణారావుకు వినతిపత్రం అందజేశారు. గతంలో ఆది ఆంధ్రా కులస్తులకు ఒక శాతం రిజర్వేషన్ కల్పించారని, జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని ఆ శాతాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో గోవిందరావు, అప్పలరాజు, ఆదినారాయణ, చిరంజీవి, గణపతిరావు, రాజు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 20 మంది ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ రోడ్‌లో ఉన్న కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు టీసీఎస్ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎస్.వి.వేణుగోపాల్ తెలిపారు. వీరిని విద్యాసంస్థల చైర్మన్ ఎస్.శేషారెడ్డి, సెక్రటరీ ఎస్.సుగుణారెడ్డి, ఏడీ బీఈపీఎల్ నాయుడు, శ్రీకాకుళం డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి తదితరులు అభినందించారు.

మణిపాత్రునికి రోటరీ అవార్డు

శ్రీకాకుళం అర్బన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మణిపాత్రుని నాగేశ్వరరావుకు రోటరీ అత్యుత్తమ పురస్కారమైన నేషనల్ బిల్డర్ అవార్డు–2024ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రదానం చేశారు.

సేవలే గుర్తింపునిస్తాయి

ఎచ్చెర్ల క్యాంపస్: విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని, విశ్రాంత ఉద్యోగులకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయం హెడ్ కానిస్టేబుల్ పి.మల్లేశ్వరరావు మంగళవారం ఉద్యోగ విరమణ చేయడంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకు చెందిన సర్పంచ్‌లు పలువురు ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో గంగు నరేంద్రకుమార్, చిట్టి రవికుమార్, గేదెల చెంగల్వరావు, కంచు వసంతరావు, పొన్నాన కూర్మారావు, బగాది మనోజ్‌కుమార్, పొన్నాం రామకృష్ణ, కుందువానిపేట సూర్యం, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గొండు శంకర్‌తో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు

తహశీల్దార్‌కు సత్కారం

గార: ఉద్యోగంలో ప్రజలకు సరైన సమయంలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు అన్నారు. మంగళవారం గార మండల తహశీల్దార్ సనపల రమణారావు ఉద్యోగ విరమణ సందర్భంగా కార్యాలయంలో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డీటీ పద్మావతి, కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

పోటీలతో విద్యార్థుల్లో సృజనాత్మకత

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని హర్షవల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ వావిలపల్లి జగన్నాథంనాయుడు, విద్యార్థి సంక్షేమ చైర్మన్ లయన్ హారిక ప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం చిత్రలేఖన పోటీల విజేత పి.యశోదకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ కరణం శోభారాణి, హెచ్‌ఎం సీహెచ్ దేవదత్తానంద్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, కార్యదర్శి మణిశర్మ, తర్లాడ అప్పలనాయుడు, డైరెక్టర్లు సుమన్, నిహార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యశోదకు బహుమతి అందిస్తున్న హర్షవల్లి లయన్స్ ప్రతినిధులు

అగ్ని ప్రమాద బాధితుడికి చేయూత

జి.సిగడాం: మండలంలోని చంద్రయ్యపేటలో ఈ నెల 30న జరిగిన అగ్ని ప్రమాదంలో కర్రి అప్పలదాసు దుకాణంలో కాలిపోవడంతో ఎచ్చెర్ల జనసేన ఇన్‌చార్జి డాక్టర్ విశ్వక్సేన్ మంగళవారం రూ.5 వేల తక్షణ సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు మీసాల రవికుమార్, భూపతి అర్జున్, తాళాబత్తుల పైడిరాజు పాల్గొన్నారు.

వర్సిటీ ప్రగతికి కృషి చేద్దాం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం –2025 డైరీ, క్యాలెండర్‌ను వీసీ కె.ఆర్.రజిని మంగళవారం ఆవిష్కరించారు. నూతన సంవత్సరంలో విశ్వవిద్యాలయం మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. వర్సిటీ ప్రగతికి అందరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థుల ఎదుగుదలకు, వారి సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు బాటలు వేయాలని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య ఆకాంక్షించారు. పలు విద్యాసంఘాల 2025 క్యాలెండర్లను సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ సంపతిరావు శశిభూషణ్‌తో కలిసి సోమవారం ఆయన ఆవిష్కరించారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను పక్కాగా సన్నద్ధంచేయాలని, శతశాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని కోరారు.

రథసప్తమికి పకడ్బందీ ఏర్పాట్లు

అరసవల్లి: ఫిబ్రవరి 4న జరగనున్న రథసప్తమి ఉత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోందని, ఈ మేరకు ఏర్పాట్లు అంతేస్థాయిలో జరగాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులను ఆదేశించారు. భార్య గొండు స్వాతితో కలిసి మంగళవారం ఆదిత్యుని దర్శించుకున్నారు. అన్నదాన ప్రసాదం స్వీకరించి రథసప్తమి ఏర్పాట్లపై ఆలయ అధికారులతో సమీక్షించారు. వీఐపీ మార్గంలో ఇష్టారాజ్యంగా ప్రవేశాలు జరగకుండా బందోబస్తు చేస్తున్నట్లు ప్రకటించారు. సమగ్రమైన రూట్ మ్యాప్‌లు సిద్ధం చేయాలని ఈవో వై.భద్రాజీని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, టీడీపీ నాయకులు ఉంగటి రమణమూర్తి, తెలుగు నాగరత్నం, ఉంగటి పాపారావు, రాయపల్లి అర్జున్ పాల్గొన్నారు.

21 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం పంచాయతీ పాతకూర్మినాయుడుపేటలో మంగళవారం నీలమ్మ అనే మహిళ నిర్వహిస్తున్న టిఫిన్ షాపులో 21 మద్యం బాటిళ్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా బాటిళ్లు బయటపడ్డాయి. మహిళపై కేసు నమోదు చేశారు.

రీ వాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేయాలి

శ్రీకాకుళం(పీఎన్.కాలనీ): బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో రెండు, నాలుగు సెమిస్టర్ల రీ వాల్యుయేషన్ ఫలితాలు తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు పి.పవిత్ర, డి.చందూ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

మొక్కల పంపిణీ

రణస్థలం: యువత నూతన సంవత్సర వేడుకల పేరుతో కేక్‌లు కత్తిరించే బదులు మొక్క నాటితే పర్యావరణానికి మేలు చేకూర్చేవారవుతారని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలకు వేప, కాగు, తురాయి, బాదం, గంగరావి, బూరుగు, నిద్రగన్నేరు, మామిడి, జామ వంటి మొక్కలను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బ్రెస్ట్‌ఫీడింగ్ రూమ్

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో డాక్టర్ చింతాడ హరనాథరావు సౌజన్యంతో ఏర్పాటు చేసిన బ్రెస్ట్‌ఫీడింగ్ రూమ్ (చిన్నారులకు తల్లులు పాలిచ్చే గది)ని మంగళవారం ఒకటో డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, వి.రమేష్, రీజనల్ కోర్ గ్రూప్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎస్ఎం ఎంపీ రావు, రాజు, ప్రసాద్ పరిశీలించారు.

ఉపాధ్యాయ ఉద్యమనేత మృతికి సంతాపం

శ్రీకాకుళం: ఉపాధ్యాయ మానస పత్రిక సంపాదకులు, ఏపీటీఎఫ్ సీనియర్ నాయకుడు, ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు సువ్వారి అచ్చన్నాయుడు (95) మంగళవారం మృతి చెందారు. శ్రీకాకుళం డీసీసీబీ కాలనీలో నివాసముంటున్న ఈయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. ఈయన స్వగ్రామం ఆమదాలవలస మండలం కనుగులవలస. అచ్చన్నాయుడు మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.


ఎస్.అచ్చన్నాయుడు(ఫైల్)